క్లుప్తంగా

హెలిప్యాడ్ పరిశీలన



ఆర్ట్స్ కళాశాలలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్ఎస్‌జీ అధికారి అరుణ్

ఆదోని అర్బన్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆదోనికి విచ్చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆర్ట్స్ కళాశాలలో హెలిప్యాడ్ స్థలాన్ని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) అధికారి అరుణ్ పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్‌లో రాజ్‌నాథ్‌సింగ్ ఆదోనికి చేరుకుంటారు. ఆర్ట్స్ కళాశాల నుంచి వాహనంలో బయలుదేరి ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి రోడ్డు షో నిర్వహిస్తారు. కోట్ల కూడలి వరకు రోడ్డు షో నిర్వహించి సభలో ప్రసంగిస్తారు. సభ అనంతరం పాత బస్టాండు మీదుగా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వరకు రోడ్డు షో నిర్వహించి, అనంతరం తిరుగు ప్రయాణం కానున్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐ నరసింహరాజు, బీజేపీ అభ్యర్థి పార్థసారథి, బీజేపీ కో-ఆర్డినేటర్ విట్టా రమేష్, తదితరులు ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



1వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి, కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప

ఎమ్మిగనూరురూరల్: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు బుట్టా సాహితి పిలుపునిచ్చారు. ఆమె శనివారం 1వ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అంది ఉంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మాల ఈరన్న, గోపాల్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 23వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకురాలు బుట్టా సాహితి వార్డు ఇన్‌చార్జ్‌లు తరుణ్‌రెడ్డి, మహేష్ రెడ్డితో ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను గెలిపించాలని విన్నవించారు. నాయకులు రుద్రాక్షాల బజారి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి



ప్రచారం చేస్తున్న పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి కోరారు. ఆయన శనివారం కోసిగి మండలంలోని నేలకోసిగి, వందగల్లు, మూగలదొడ్డి, చిర్తనకల్లు, సాతనూరు కొట్టాల గ్రామాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి మద్దతుగా మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, సుందరరాజు దొర, నాడుగేని నాగరాజు, మాంతేష్ స్వామి, కాల్వ కొరవంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



పెద్దనేలటూర్‌లో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: వైఎస్ జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని యువ నాయకుడు బుట్టా ప్రతుల్ కోరారు. శనివారం మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యలకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకుల తప్పుడు హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కోఆప్షన్ మెంబర్ రావూఫ్, నాయకులు బందెనవాజ్, లోక్‌నాథ్ రెడ్డి, జహంగీర్, సోమన్న, వెంకటేష్, గోపాల్, శ్రీను, దేవరాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక
- పోనకలదిన్నె, సోమలగూడూరు గ్రామాల్లో రోడ్ షో
- అడుగడుగునా జననీరాజనం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విన్నవిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్ కుటుంబాన్ని కలిసిన బుట్టా రేణుక

నందవరం: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు, కుతంత్రాలు చేసినా గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ధీమా వ్యక్తం చేశారు. ఆమె శనివారం నందవరం మండల పరిధిలోని పోకనలదిన్నె, సోమలగూడూరు, ముగతి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ సర్పంచ్ పావని, ఎంపీటీసీలు జైపాల్ రెడ్డి, మాధవి ఆధ్వర్యంలో రోడ్ షో చేపట్టారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు డ్రమ్స్‌లు, పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ.. అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయడమే టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని ఎవరూ మరువవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసేదే చేబుతారని, చెబితే తప్పక నెరవేరుస్తారన్నారు. మాట తప్పని మనసున్న రారాజు జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు (ఎమ్మెల్యే, ఎంపీ) ఫ్యాన్ గుర్తుకు వేయాలని విన్నవించారు. పార్టీ నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, రామచంద్రారెడ్డి, రఘు, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్, మేకల ఈరన్న, బసవరాజు, శివారెడ్డగౌడ్, గణపతి, రాఘవరెడ్డి, ఉరకుందరెడ్డి, రంగన్న, తారకరాముడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించుకుందాం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ఐక్యంగా కృషి చేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె శనివారం భర్త శివనీలకంఠతో కలిసి రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, సీనియర్ నాయకుడు మాచాని నాగరాజు నివాసాలకు వెళ్లి వారితో పాటు కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగనన్న కుర్ని కుల స్తులకు నేతన్ననేస్తంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించారని ఆ వర్గీయులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చేలా కృషి చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, పార్టీ నాయకులు సునీల్‌కుమార్, కేశవరెడ్డి, మాచాని పరమేషప్ప, మాచాని సోమన్న, కేఆర్ నటరాజ్‌రెడ్డి, నాగేంద్ర, రాజేంద్రప్రసాద్, మాచాని రఘు, కిరణ్, షఫి తదితరులు పాల్గొన్నారు.







బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాలుగు గ్రామాల టీడీపీ శ్రేణులు, వైఎస్సార్‌సీపీలో చేరిన కందనాతి టీడీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీలో చేరిన అల్తాఫ్, తదితరులు

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండల పరిధిలోని హాలహర్వి గ్రామ టీడీపీ నాయకుడు గడ్డం నారాయణ రెడ్డి తన అనుచర వర్గమైన హాలహర్వి, జగ్గాపురం, ధర్మాపురం, బాపురం గ్రామాలకు చెందిన కార్యకర్తలతో శనివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వెయ్యి మందికి పైగా టీడీపీ శ్రేణులు పార్టీలో చేరగా ఆమెతో పాటు బుట్టా శివనీలకంఠ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు.

- ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ ఆంజనేయ, నాయకులు ఆనంద్, రాజు, పోలయ్య, సురేష్, మార్క్, నర్సన్న తదితరులు వైఎస్సార్‌సీపీ పంచన చేరారు.
- జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్, పట్టణ టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు అల్తాఫ్ తన అనుచరులతో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఆయనతో పాటు గోరాబాష, సలీంబాష, భీమన్న, సాంబశివుడు, తెలుగురాముడు, మేటివలిబాష, అఫ్గన్‌వలి, అబ్బాస్, రహిమాన్, సురేష్, ఇమ్రాన్, పలువురు మహిళా కార్యకర్తలకు బుట్టా రేణుక కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్‌లు ఉన్నారు.

6 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకొనే ఉద్యోగులకు పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో 5 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మిగనూరు మండలానికి 2 పోలింగ్ బూత్‌లు, నందవరం మండలానికి 1, గోనెగండ్ల మండలానికి 1, ఇతర జిల్లాల వారికి 1 పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగులు ఎన్నికల విధుల ఉత్తర్వుల కాపీతో పాటు ఓటరు కార్డు తీసుకెళ్లి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నెంబర్ తెలుసుకొని ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు. అటెస్టేషన్‌కై ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక గెజిటెడ్ అధికారిని నియమించామని, పోస్టల్ బ్యాలెట్ జాబితా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సీట్లు

ఆదోని సెంట్రల్: విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1)సి ప్రకారం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ పిల్లలకు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని పక్కగా అమలు చేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన వారి జాబితాను విడుదల చేసిందని మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో 126 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా గతేడాది 543 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. 2024-25 విద్యాసంవత్సరంలో 456 మందికి మొదటి విడతలో ప్రవేశాలు కల్పించారు. సీట్లు పొందిన వారు ఈ నెల 10వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలని సూచిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సమాచారం అందించారు.

జగనన్న ధాటికి తోడేళ్ల గుంపు పరార్



చిన్నకడబూరులో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కలశాలతో ఆహ్వానం పలుకుతున్న బాలికలు



రోడ్ షోకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

మంత్రాలయం/పెద్దకడబూరు: సార్వత్రిక ఎన్నికల్లో సింగిల్‌గా పోటీకి సిద్ధమైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధాటికి కూటమి తోడేళ్ల గుంపు పరార్ కావాల్సిందేనని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన శనివారం పెద్దకడబూరు మండలంలోని రంగాపురం, చిన్నకడబూరు, మేకడోణ, నౌలేకల్లు, ముచ్చగిరి, గవిగట్టు, పీకలబెట్ట, బాపులదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ షోలో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు ఎంత మందితో జతకట్టినా.. ఎన్ని సూపర్ సిక్స్ హామీలు ప్రకటించినా అధికారంలోకి రావడం పగటికలేనని స్పష్టం చేశారు. సంక్షేమ పాలనలో జగనన్న సువర్ణాధ్యాయం లిఖించారని గుర్తు చేశారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేర్చారని వివరించారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల వద్దకే పాలన తెచ్చారని చెప్పారు. చంద్రబాబు దుర్మార్గపు కుట్రలతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను పింఛన్ల కోసం బ్యాంకులు, అధికారులు చుట్టూ తిరిగేలా చేశారని దుయ్యబట్టారు. అధికారం కోసం పెత్తందార్లు లేనిపోని హామీలను ఇస్తున్నారని, టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. తాను ఇసుక దందా చేస్తున్నానని టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు.

పల్లెపల్లెనా ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారానికి వచ్చిన అభిమాన ఎమ్మెల్యేకు ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, కలశాలతో ఆహ్వానం పలుకుతున్నారు. చిన్నకడబూరులో బాలికలు కలశాలతో ఎదురురాగా, బాణసంచా మెరుపులు, డప్పులతో ఆహ్వానం పలకడం కనువిందు చేసింది. అలాగే మేకడోణ, నౌలేకల్లు, ముచ్చగిరి, గవిగట్టు, పీకలబెట్ట గ్రామాల్లోనూ ఇదే తరహా ఊరేగింపులు జరిగాయి. ప్రచారానికి వస్తున్న స్పందనతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రచారంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచులు సుజాత, పల్లవి, నాగరాజు, లక్ష్మి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆమె తనయుడు బుట్టా ప్రతుల్ నిర్వహించిన ఎన్నికల ప్రచారం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలో యువ నాయకుడు జహంగీర్ ఆధ్వర్యంలో యువకులు వైఎస్సార్‌సీపీ జెండాలను పట్టుకొని జై జగన్ నినాదాలతో చిన్న నేలటూర్ గ్రామం నుంచి పెద్దనేలటూర్ వరకు ర్యాలీ నిర్వహించి మద్దతు ప్రకటించారు. అలాగే బుట్టా ప్రతుల్‌కు ఎంపీటీసీ లోక్‌నాథ్‌రెడ్డి, జహంగీర్ తదితరులు డ్రమ్స్, తప్పెట్లతో ఘనస్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. యువకులు, కార్యకర్తలు సీఎం జగన్ చిత్రాలతో కూడిన జెండాలను ప్రదర్శించారు. ప్రజలు జై జగన్ అంటూ హోరెత్తించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దనేలటూర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాలతో బైక్ ర్యాలీ చేస్తున్న యువకులు

ఉప్పొంగిన అభిమానం

నందవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నందవరం మండలంలో నిర్వహించిన రోడ్ షో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం కలిగింది. కార్యకర్తలు, అభిమానులు, జనం బుట్టా రేణుకకు నీరాజనం పలికారు. శనివారం మండలంలోని పోనకలదిన్నె, సోమలగూడూరు, ముగతి గ్రామాల్లో చేపట్టిన యాత్రకు విశేష స్పందన లభించింది. కార్యకర్తలు, అభిమానులు డ్రమ్స్‌లతో పాటు పూలు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు పూలమాలలు, శాలువాతో సత్కరించారు, యువకులు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు మేమంతా సిద్ధం అంటూ సీఎం జగనన్న చిత్రాలతో ఉన్న ప్లకార్డులు, జెండాలను ప్రదర్శించి రోడ్ షోలో చిందులేశారు. అనంతరం బుట్టా రేణుక ప్రసంగం యువత, మహిళలను ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, ఆయా గ్రామ సర్పంచ్ పావని, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక రోడ్ షోలో కార్యకర్తల సందడి



సోమలగూడూరులో అభివాదం చేస్తున్న బుట్టా రేణుక



రోడ్ షోలో వైఎస్సార్‌సీపీ జెండాలతో చిందులు



భవనం పైకెక్కి బుట్టా రేణుక ప్రసంగాన్ని తిలకిస్తున్న అభిమానులు

సంక్షేమాభివృద్ధికి చిరునామా సీఎం జగన్

కౌతాళం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలోని ఉప్పర వీధి, వైఎస్సార్ నగర్, మంచాలవీధి వివిధ కాలనీల్లో శనివారం నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతూ ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమాభివృద్ధికి చిరునామాగా మారారన్నారు. నాయకులు అబ్దుల్‌సమద్, భీమేష్, సర్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కౌతాళంలో ప్రచారం చేస్తున్న ప్రహ్లాదచారి

వివాహిత ఆత్మహత్య

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ లక్ష్మి (34) కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ లక్ష్మి, భర్త వెంకటేష్ గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మి గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారుజామున ఇంట్లో పైకప్పుకు ఉన్న కొక్కేనికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుంకులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల సంక్షేమాన్ని దెబ్బతీసే బీజేపీతో జతకట్టిన టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఇలియాజ్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం పట్టణంలోని 12వ వార్డులో జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, రసూల్‌తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీతోనే ముస్లిం సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీ పెద్దల వ్యాఖ్యలను వారితో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు షాబుద్దీన్, వాహిద్, ఇషాక్, రఫీక్, హాజీ వహబ్, అబ్రార్, గట్టుభాజ, రజాక్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం నాయకుడు ఇలియాజ్

9న బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

ఆదోని అర్బన్: ఈనెల 9వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఆదోని పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నఖాతే శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం తన స్వగృహంలో మాట్లాడుతూ.. సమావేశానికి పట్టణంలోని బ్రాహ్మణ సోదర, సోదరీమణులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. బ్రాహ్మణ సంఘం నాయకులు వెల్లాల మధుసూదనశర్మ, దేశాయ్ గిరి, నఖాతే శ్రీధర్, దేశాయ్ ప్రకధర్, గరుడాద్రి దత్తాత్రేయశర్మ, భీమ్‌సేనరావు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి అభిషేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



కౌతాళంలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

విస్తృతంగా ఇంటింటి ప్రచారం

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డి, ఎంపీగా బీవై.రామయ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శనివారం ఆదోని పట్టణంలో యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, సతీమణి హిరణ్మయిరెడ్డి, ఎమ్మెల్యే కుమార్తె గౌతమిరెడ్డి, నారీమణులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేశారు. 5, 6 వార్డుల పరిధిలోని అరుంజ్యోతినగర్, ఎన్‌జీవోస్ కాలనీ, ఎంఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఆదోని అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా మరోసారి సాయిప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందిరానగర్‌లో 18వ వార్డు కౌన్సిలర్ చలపతి, నాయకులు రామాంజనేయులు, మధుసూదన్, విశ్వ, తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఆదోనిలో రూ.500 కోట్లకు పైగానే అభివృద్ధి పనులు జరిగాయని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో పలువురు వార్డు వలంటీర్లు శనివారం తమ పదవులకు రాజీనామా చేస్తూ సచివాలయాల అడ్మిన్‌లకు పత్రాలను అందజేశారు.వీటిని ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సిఫార్సు చేశారు. 18వ వార్డులో గోపాల్‌నారాయణ, సుగుణావతి, పద్మ, చాముండేశ్వరి, హనుమంతు, మహేంద్ర, 9వ వార్డులో లక్ష్మినారాయణ, 29వ వార్డులో హేమావతి, భవానీ, మహేశ్వరి రాజీనామా చేశారు.

43 మంది వలంటీర్ల రాజీనామా

ఆదోని రూరల్: మండలంలోని వివిధ సచివాలయ పరిధిలో శనివారం 43 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయశేఖరరావుకు అందజేశారు. కపటి సచివాలయం నుంచి 8 మంది, నాగలాపురంలో ఒకరు, పెద్దహరివాణం-2 నుంచి ఒకరు, నాగనాథనహళ్లి నుంచి ఒకరు, కుప్పగల్ నుంచి ఒకరు, నారాయణపురం నుంచి ఇద్దరు, ఆరేకల్ నుంచి 5 మంది, విరుపాపురం నుంచి 4, జి.హొసళ్లి నుంచి ఇద్దరు, మదిరె-2 సచివాలయం నుంచి ఒకరు, పెద్దతుంబళం-1 నుంచి ఇద్దరు, పెద్దతుంబళం-2 నుంచి ఇద్దరు, బల్లేకల్ సచివాలయం నుంచి 8 మంది, ధణాపురం నుంచి ఇద్దరు, బసాపురం నుంచి ముగ్గురు వలంటీర్లు రాజీనామాలు చేశారు.